క్లుప్తంగా

అభయాంజనేయస్వామి దేవస్థానంలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేష పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత బైసాని కోటేశ్వరరావు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నాగేంద్రస్వామివారికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో పంచముఖ శ్రీ నాగేంద్రస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, స్వామివారికి విశేష అలంకరణ చేశారు. శ్రీసాయి భక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

1 నుంచి సాయిబాబా మందిర వార్షికోత్సవం

పెనమలూరు: పోరంకి శ్రీనివాసానగర్‌లో శ్రీ షిర్డీ సాయిబాబా మందిర 29వ వార్షికోత్సవాన్ని వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు శ్రీషిర్డిసాయి సేవాసమితి అధ్యక్షుడు మున్నంగి అర్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ శ్రీషిర్డీ సాయి బాబా మందిరం ఏర్పాటు చేసి 28 ఏళ్ల గడవటంతో వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు బాబా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు బాబాకు విశేష పూజలు జరుగుతాయని చెప్పారు. మార్చి 4వ తేదీన తెల్లవారుజామున 5.15 గంటలకు కాగడా హారతి, బాబా మంగళస్నానం, 6.30 గంటలకు దోనేపూడి దుర్గాప్రసాద్ దంపతులచే 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం తుమ్మలపల్లి హరికృష్ణ దంపతులచే పళ్ల రసంతో స్నపన, 7.30 గంటలకు విశేష అలంకరణ, విష్ణు సహస్ర నామపారాయణ, 8 గంటలకు జొన్నలగడ్డ సురేష్ దంపతులచే తులసీదళ పూజలు, సాయిరామ్ దంపతులచే వెండి మారేడు దళాలతో విశేష అర్చన, అనంతరం అన్నాభిషేకం పూజలు నిర్వహిస్తామని చెప్పారు. పాదుకా ఉత్సవం, పతాకావిష్కరణ అనంతరం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మందిర వార్షికోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

బైక్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: బైక్ చోరీకి గురైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు గ్రామానికి చెందిన పురంశెట్టి సత్యనారాయణ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తాడు. అతనికి బుల్లెట్ బైక్ ఉంది. కాగా బైక్‌ను కొద్ది రోజుల క్రితం ఇంటి ఎదుట పార్కు చేశాడు. అయితే దానిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బైక్ కోసం పలు ప్రాంతాల్లో వెతికాడు. బైక్ దొరక్కపోవటంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోనాయి చెరువు గండిని పూడ్చివేయాలి

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు పైలెట్ ప్రాజెక్టుకు కొట్టిన గండిని గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే పూడ్చి వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చెరువుకు కొట్టిన గండిని ఆ పార్టీ నాయకులు పఠాన్ సర్దార్, గుండిమెడ ఉదయ భాస్కర్, సూరగాని సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో తాగునీటి అవసరాలు నిమిత్తం పైలెట్ స్కీమ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ స్కీమ్‌లోకి బోర్లు నుంచి నీటిని పంపింగ్ చేయకుండా తొండంగట్టు చెరువు నీటిని తరలించడం సరికాదన్నారు. నాయకులు మిరపా నాగేశ్వరరావు, చెరువుగట్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడపలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ 2లో బుర్రిరామ్‌గోపాల్ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతను ఏసీ మెకానిక్‌గా పని చేస్తుండగా అతని సోదరుడు శివదుర్గాప్రసాద్ అతని వద్దే పని చేస్తున్నాడు. కాగా శివదుర్గాప్రసాద్ ఈ నెల 23న గుంటూరులో పెళ్లికి వెళ్లి వస్తానని వెళ్లాడు. ఆ తరువాత అతను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు శివదుర్గాప్రసాద్ కోసం వెతికారు. అయితే అతని జాడ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అభివృద్ధికి చిరునామా వేలేరు

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- మారిన గ్రామం రూపురేఖలు
- ప్రజలకు గడప వద్దకే ప్రభుత్వ సేవలు



గ్రామంలోని సచివాలయ భవనాల సముదాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పల్లెటూళ్ల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. గ్రామాలు అభివృద్ధికి దర్పణాలుగా నిలుస్తున్నాయి. ఊరూరా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కు అభివృద్ధి జాడలు నిలువెత్తు సాక్ష్యాలుగా కనబడుతున్నాయి. బాపులపాడు మండలం వేలేరులో అభివృద్ధికి చిరునామాగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుమారు రూ .45 కోట్ల వ్యయంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరగ్గా, డీబీటీ పద్ధతిలో మరో రూ.20.07 కోట్లు మేర పేదలకు లబ్ధి జరిగింది.



రహదారులపై రయ్‌రయ్..

బాపులపాడు, నూజివీడు మండలాల్లోని ఆరు గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న రోడ్డును విస్తరించటంతో పాటు అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.29.80 కోట్ల నిధులను మంజూరు చేసింది. బాపులపాడు మండలంలోని కోమటిగుంట నుంచి మొదలయ్యే ఈ రోడ్డు వేలేరు మీదుగా మల్లిబంధం సెంటర్‌కు చేరుకుని, అక్కడి నుంచి నూజివీడు మండలంలోని సీతారామపురం, పల్లెర్లమూడి గ్రామాలను కలుపుకుంటూ, ఆ తర్వాత కొయ్యూరు మీదగా బొమ్ములూరు వద్ద మళ్లీ 16వ నంబర్ జాతీయ రహదారిని కలుస్తుంది. దాదాపు 18 కిలోమీటర్ల మేర ఆరు గ్రామాల గుండా నిర్మించిన ఈ రోడ్డుకు ఆయా గ్రామాల పరిధిలో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రస్తుతం నాలుగు మీటర్లు వెడల్పు కలిగిన ఈ రోడ్డును 23 అడుగులకు విస్తరించారు. మరో రూ.7.5 కోట్ల వ్యయంతో వేలేరు టూ మీర్జాపురం రహదారి నిర్మించారు. వేలేరు శివారులోని కోమటిగుంట చెరువు రోడ్డు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి రేమల్లే, కొత్త మల్లవల్లి గ్రామాల మీదుగా ఏలూరు జిల్లా మీర్జాపురం వద్ద నేషనల్ హైవే 216హెచ్‌ను కలుపుతూ కొత్త రహదారి నిర్మాణం చేపట్టారు. నాబార్డు రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మంజూరైన రూ.7.5 కోట్లతో ఈ రహదారిని నిర్మించారు. దీంతో వేలేరు, రేమల్లే, కొత్తమల్లవల్లి గ్రామాలకు నేరుగా కోమటిగుంట వద్ద చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. ఆయా గ్రామాల రైతులకు వ్యవసాయ ఉత్పత్తులైన వరి, చెరకు, పామాయిల్ రవాణా చేసుకునేందుకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. రహదారులపై రయ్‌రయ్ మంటూ ప్రజలు దూసుకుపోతున్నారు.

ఒకే చోట ప్రభుత్వ భవనాలు

వేలేరు – సీతారామపురం ప్రధార రహదారి వెంబడి ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ భవనాలు నిర్మించటం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే ఈ నాలుగు భవనాల



నాబార్డు నిధులతో నిర్మించిన వీరవల్లి - మీర్జాపురం రోడ్డు

నిర్మాణాల పూర్తి కావటంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైయ్యాయి. రూ.45 లక్షలతో రెండు అంతస్తులతో గ్రామ సచివాలయం భవనం, రూ.28 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, రూ.25 లక్షల వ్యయంతో డిజిటల్ లైబ్రరీ, రూ.23 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. అంతేకాక ఈ భవన సముదాయం చుట్టూ మరో రూ.20 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పచ్చదనంతో కనువిందు చేసే ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు

గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4.40 కోట్లతో 8 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. గ్రామంలో 300 మంది నిరుపేదలకు సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. అంతేకాక వైఎస్సార్ జగనన్న కాలనీలో విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించింది. రూ.30 లక్షలతో తాగునీటి సరఫరా నిమిత్తం రెండు విద్యుత్ మోటారు బోర్లు, పైప్‌లైన్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలు

- రూ.29.80 కోట్లతో వేలేరు టూ బొమ్ములూరు రహదారి
- రూ.7.5 కోట్లతో వేలేరు టూ మీర్జాపురం రహదారి
- రూ.1.60 కోట్లతో పలు ప్రభుత్వ భవనాలు
- రూ.4.40 కోట్లతో పేదలకు ఇళ్ల స్థలాలు
- డీబీటీ ద్వారా రూ.20.07 కోట్ల లబ్ధి
- రూ.52 లక్షలతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు
- రూ.34 లక్షలతో గోడౌన్ నిర్మాణం

సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

గ్రామంలో దక్షిణ ఎస్సీ కాలనీలో రూ.12 లక్షలతో 5 సీసీ రోడ్లు, ఉత్తర ఎస్సీ కాలనీలో మరో రెండు సీసీ రోడ్లను రూ.7 లక్షలతో నిర్మించారు. మొయిన్ గ్రామంలో రూ.5 లక్షలతో, ఎస్టీ కాలనీలో మరో రూ.5 లక్షలతో రెండు సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు. బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలతో కాంపౌండ్ నిర్మాణం, వేదిక నిర్మించగా, గ్రామ ప్రధాన కూడలి వద్ద రూ. లక్షతో రచ్చబండ అభివృద్ధి చేశారు. ఎస్టీ కాలనీలో రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టారు.

పీఎం శ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

డీఈఓ తాహెరా సుల్తానా



కంకిపాడు: పీఎం శ్రీ(ప్రధాన మంత్రి, స్కూల్స్ రైసింగ్ ఇండియా)కి ఎంపికైన పాఠశాలలకు విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తాహెరా సుల్తానా సూచించారు. ఉయ్యూరు డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం కంకిపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ.. పీఎం శ్రీ నిధులను వినియోగించి పాఠశాలల్లో క్రీడా మైదానాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ ట్రాక్‌లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చెప్పారు. క్రీడా ప్రాంగణాల అభివృద్ధితో క్రీడాకారులకు వసతులు సమకూరుతాయన్నారు. క్రీడాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. సమావేశంలో డీవైఈఓ ఐ.పద్మారాణి, ఎంఈఓలు, డివిజన్ పరిధిలో పీఎం శ్రీకి ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలోని నూజివీడు రోడ్డు, కృష్ణా నగర్, ఐటీఐ రోడ్డు, మహాత్మాగాంధీ నగర్, రైల్వేస్టేషన్, ఇందిరా నగర్, గుడివాడరోడ్డు, బీసీ కాలనీ ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రగతి పథంలో యువత

విస్తరాకుల యూనిట్ స్థాపనతో ఆర్థిక స్వావలంభన

గన్నవరంరూరల్: ఆర్థిక ప్రగతి సాధించటంలో యువత వినూత్నంగా ముందుకు వెళ్తోంది. గ్రామ ప్రాంతాల్లో సైతం చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటూ ప్రగతి సాధన వైపుగా ప్రయాణం చేస్తున్నారు. స్వయంకృషి, ప్రభుత్వ ప్రోత్సాహం వెరసి వారి జీవితాలు అభివృద్ధి బాటలో నడిచేందుకు మార్గం సుగమం చేసుకుంటుంది.

వినూత్న ఆలోచనతో ముందుకు

గన్నవరం మండలం బీబీ గూడెం గ్రామంలో వెంగల భార్గవ్ కుమార్, రమ్యకృష్ణ దంపతులు విస్తరాకుల తయారీ పరిశ్రమను ప్రారంభించారు. ఆరు నెలల క్రితం వచ్చిన ఆలోచనతో స్థానిక శివాలయం వీధిలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని విస్తరాకుల తయారీ యూనిట్‌ను రూ.13 లక్షలు పెట్టుబడితో నెలకొల్పారు. ముడి సరుకును విజయవాడ, హైదరాబాద్ నుంచి కొనుగోలు చేస్తున్నట్లు భార్గవ్ కుమార్ తెలిపారు.

ఏడు రకాల విస్తళ్ల తయారీ

వీరి వద్ద ఏడు రకాలైన విస్తరాకులు తయారవుతున్నాయి. 12, 14 సైజులో పెద్దవి, 12, 16 సైజులో, టిఫిన్ ప్లేట్లు 8, 9, 10 సైజులో తయారు చేస్తూ మార్కెటింగ్ చేసుకుంటున్నారు. వీరికి విజయవాడ గొల్లపూడి మార్కెట్ నుంచి ఆర్డర్‌లు లభిస్తున్నట్లు చెప్పారు. అంతేగాక ఆర్డరు ఇస్తే వినియోగదారులకు నచ్చినట్లుగా విస్తళ్లు తయారు చేసి ఇవ్వగలమన్నారు. దీంతో పాటు టీ గ్లాసులు, టిఫిన్ ప్లేట్లు, పేపర్ రోల్స్ హోల్‌సేల్‌గా విక్రయిస్తూ వ్యాపారులకు అందుబాటులో ఉంచారు.

బీబీ గూడెంలో తయారీ యూనిట్

గొల్లనపల్లి తన స్వస్థలమని, బీబీ గూడెంలో పరిశ్రమ ఏర్పాటు చేశామని భార్గవ్ కుమార్ చెప్పారు. తక్కువ ధరల్లో వినియోగదారులకు నాణ్యమైన విస్తళ్లు, టిఫిన్ ప్లేట్లు సరఫరా చేస్తున్నామన్నారు. గన్నవరంలోని హోల్‌సేల్ వ్యాపారులకు తాము ఉత్పత్తిని అందజేస్తున్నట్లు వివరించారు. బ్యాంకు ద్వారా 30 శాతం సబ్సిడీపై రుణం తీసుకున్నామని, వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు భార్గవ్‌కుమార్ చెప్పారు. యువత ప్రస్తుత పరిస్థితుల్లో వినూత్న ఆలోచనలతో చిన్న పరిశ్రమలు స్థాపిస్తూ తమతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించటం ఆదర్శనీయం.



మిషన్‌పై విస్తరాకులు తయారు చేస్తున్న భార్గవ్‌కుమార్



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన విస్తరాకులు

4, 5 తేదీల్లో గణిత శాస్త్రంపై జాతీయ సదస్సు

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేసే దిశగా మార్చి నెల 4, 5 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్ర లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో గణిత శాస్త్ర జాతీయ స్థాయి సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. వచ్చే నెల 4,5 తేదీలలో జరిగే ఈ కార్యక్రమానికి దేశంలో పేరెన్నికగన్న విద్యా సంస్థల నుంచి గణితశాస్త్ర అధ్యాపకులు వస్తారన్నారు. గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులు, అవకాశాలు వంటి విషయాలను వారు వివరిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గణితంలో మెలకువలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్, గణిత శాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాలరావు, కన్వీనర్లు అనురాధ, తబిత పాల్గొన్నారు.

కేఎస్ వాస్ మృతి తీరని లోటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ చిత్రకారుడు ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు కేఎస్ వాస్ (77)మృతి చిత్రకళారంగానికి తీరని లోటు అని ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి ఎంవీ సాయిబాబు అన్నారు. స్థానిక ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి లలిత కళా ఆర్ట్స్ గ్యాలరీలో మంగళవారం ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యాన చిత్రకారుడు కేఎస్ వాస్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ వాస్ చిత్రకళ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. నగరంలో వందలాది మంది విద్యార్థులకు చిత్రకళలో మెలకువలు నేర్పించి చిత్రకారులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్రకారులు మల్లిక్, దుర్గాప్రసాదరావు, రమేష్, సునీల్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొని వాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సమాజంలో నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ

గన్నవరంరూరల్: సమాజంలో నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ తెలిపారు. చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ల్యాంప్ లైటింగ్ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రోగిని 24 గంటలు కంటికి రెప్పలా కాపాడేది నర్సులన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు మార్గదర్శనం కావాలన్నారు. మానవత్వంతో నర్సులు రోగులకు సేవలందించాలని చెప్పారు. 21వ బ్యాచ్ జీఎన్‌ఎం, 16వ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచంలో నర్సుల కొరత

ప్రిన్సిపాల్ జె.వందన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కన్వీనర్ వి.శశికళ మాట్లాడుతూ ప్రపంచంలో ఈ నాటికి నర్సుల కొరత ఉందన్నారు. నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని, విలువలతో కూడిన విద్యను తమ కళాశాల, స్కూల్ అందిస్తున్నాయని చెప్పారు. ఇదే ఆవరణలో మెడికల్ కళాశాల, ఆస్పత్రి వంటి శిక్షణకు ఉపయోగపడే వనరులు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకుని భవిష్యత్‌లో అందరూ మెచ్చే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, ఏపీఎస్‌ఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల, సి.కళ్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ల్యాంప్ లైటింగ్ కార్యక్రమంలో స్కూల్, కళాశాల బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ బాబ్జీ, అతిథులు



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ బాబ్జీ

జక్కంపూడి కాలనీలో బైక్ దగ్ధం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు నిలిచి ఉంచిన బైక్ దగ్ధమైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో జరిగింది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 181లో బత్తుల భానుప్రకాష్ కుటుంబం నివాసం ఉంటోంది. భానుప్రకాష్ బందరురోడ్డులోని ఓ జూవెలరీ షోరూమ్‌లో పని చేస్తుంటాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన భానుప్రకాష్ తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. తెల్లవారుజామున ఇంటి ముందు ఏదో పేలిన శబ్దం, టైర్లు కాల్చిన వాసన రావడంతో భానుప్రకాష్ భార్య లేచి చూడగా, ఇంటి ముందు పెట్టిన బైక్ కాలిపోతూ కనిపించింది. దీంతో వెంటనే భర్తను నిద్ర లేపి ఇద్దరూ బయటకు వెళ్లి చూసేసరికి బైక్ పూర్తిగా కాలిపోయింది. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏజీ కార్యాలయంతో ఎస్‌ఆర్‌ఆర్ అవగాహన ఒప్పందం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏజీ కార్యాలయానికి చెందిన తెలుగేతర ఉద్యోగులకు తెలుగు భాషను నేర్పించడం కోసం మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖతో ఏజీ కార్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం గత నాలుగేళ్లుగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీతో గత ఒప్పందం గడువు ముగిసిన కారణంగా తిరిగి కొత్తగా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ ఒప్పందం రాబోయే మూడేళ్ల పాటు అమల్లో ఉంటుందన్నారు. దీని ప్రకారం ఏజీ కార్యాలయ ఉద్యోగులకు కళాశాల తెలుగు శాఖ తెలుగు భాషను 'తెలుగు పరిచయం కోర్సు' పేరుతో, రోజుకు రెండు గంటలు చొప్పున 48 పని దినాల్లో నేర్పిస్తుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన ఉద్యోగులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఆ ఉద్యోగులకు వారి ఉద్యోగం క్రమబద్ధీకరణ చేస్తారని తెలిపారు.



ఏజీ కార్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మద్యం విక్రయిస్తున్న వృద్ధుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వృద్ధుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 28 క్వార్టర్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెక్టార్ ఎస్ఐ దేవసుధ మంగళవారం గస్తీ నిర్వహిస్తుండగా ఫోర్‌మెన్ బంగ్లా వద్ద వృద్ధుడిని తనిఖీ చేయగా మద్యం సీసాలు లభించాయి. తాను ఓ బార్‌లో పని చేస్తానని, అదనపు ఆదాయం కోసం మద్యం విక్రయిస్తుంటానని చెప్పాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్రం – ఎలక్ట్రానిక్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో చిత్ర ప్రదర్శన, ప్రాజెక్టుల ప్రదర్శన, క్విజ్ కార్యక్రమాలను చేపట్టారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులతో పాటు సిద్ధార్థ కళాశాల, ఇతర కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, రసాయన శాస్త్ర శాఖ అధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు, వృక్ష శాస్త్ర అధిపతి స్వప్న న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలే కాదు, మంచి ఉపాధ్యాయులు కావాలంటే సామాన్య శాస్త్రాలనే చదవాలన్నారు. అంశాల వారీగా నిర్వహించిన ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

ప్రభుత్వాస్పత్రికి వీల్‌చైర్, స్ట్రెచ్చర్ అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రికి వచ్చే నడవలేని రోగులకు ఉపయోగపడేలా కాకాని ఆశయ సమితి ఆధ్వర్యంలో మంగళవారం వీల్‌చైర్, స్ట్రెచ్చర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని తరుణ్, ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం ఫిబ్రవరి 27న ప్రపంచ ఎన్జీవో (ప్రభుత్వేతర సంస్థలు) దినోత్సవం సందర్భంగా వీల్‌చైర్ స్ట్రెచ్చర్ అందించారు. మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం, ఆయన తనయుడు దివంగత కాకాని రామ్మోహన్‌రావు స్మారకార్థం డాక్టర్ తరుణ్ కాకాని స్థాపించిన కాకాని ఆశయ సాధన సమితి స్వచ్ఛంద సంస్థతో పాటు ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, న్యాయమూర్తి చిరంజీవి పాల్గొని ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ నమ్రతకు అందజేశారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి గోగినేని ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహనకు కళాజాతా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహనకు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సహకారంతో ఆటోనగర్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శన ద్వారా హెచ్.ఐ.వి.(ఎయిడ్స్), ఏఆర్‌టీ మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్, ఏపీ శాక్స్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ట్రక్కర్స్ ప్రాజెక్ట్స్ మేనేజర్ వీవీ సాంబశివరావు, ఏఎస్‌ఎం శాంతకుమారి, సిబ్బంది ఎ.వరప్రసాద్, ఎం.శేషుకుమార్, వై.రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో కళాజాతా ప్రదర్శిస్తున్న కళాకారులు